క్లుప్తంగా

విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపర్చాలి

స్వర్ణ (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం వారు మండలంలోని స్వర్ణ, కుంకలమర్రు గ్రామాల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. టీఎల్ఎం ద్వారా విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే భాషలో వారికి బోధించాలన్నారు. అలాగే వారు వేటిపై ఆసక్తి చూపుతున్నారో గమనించి వాటిపై మరింత పటుత్వం ఉండేలా వారికి నైపుణ్యాభివృద్ధి చేయాలని చెప్పారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌లు ఎంవీ సుబ్బారావు, పద్మావతి, కాంప్లెక్స్ కార్యదర్శులు పావులూరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

యద్దనపూడి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. బుధవారం మండలంలోని జాగర్లమూడి ఏఎస్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి, లైంగిక వేధింపుల గురించి వివరించారు. బాలలు అత్యవసర పరిస్థితుల్లో 108 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. పిల్లల హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాయని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎస్ .అంజయ్య, మధుబాబు, అంగన్‌వాడీ సిబ్బంది పి. నాగరాజ, త్రివేణి, సుజాతమ్మ, సునీత విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరసేవల్లో అలసత్వం వద్దు

బల్లికురవ: సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటుతో పౌరసేవలు అందించాలని ఎంపీడీవో కుసుమ కుమారి కోరారు. బుధవారం వల్లాపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. అటెండెన్స్ మూమెంట్ రిజిస్టర్‌లతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పలు రిజిస్టర్‌లను పరిశీలించారు. విధుల్లో అలసత్వం వీడి అంకిత భావంతో పనిచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను ఆటపాటలతో తీర్చిదిద్దాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. వల్లాపల్లి సచివాలయ పరిధిలోని రెండు అంగన్ వాడీ కేంద్రాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం రుచి శుచిగా వండి వడ్డించాలని సహాయకులను ఆదేశించారు. సెక్రటరీ కేవీ అనిల్ కుమార్, కార్యకర్తలు వరలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి రాకతో అభివృద్ధి శూన్యం

- నియోజకవర్గంలో 85 సచివాలయాల ఏర్పాటు
- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం
- అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణ పనులు



కొణిదెనలో తుదిదశ పనుల్లో ఆర్బీకే, సచివాలయం

బల్లికురవ: ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో గత ఐదేళ్లలో అభివృద్ధి చెందిందనేది అక్షరాల సత్యం. గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యాన్ని మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిజం చేస్తే.. దానిని కూటమి ప్రభుత్వం నర్వీర్యం చేసింది. మన ఊరిలోనే సేవలందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయాలకు నేడు గ్రహణం పట్టింది. గ్రామ స్వరాజ్య స్థాపనకు గత ప్రభుత్వం సచివాలయాలు వ్యవస్థ ఏర్పాటు చేసింది. గ్రామాల్లో అందుబాటుతో పౌర, రైతు, వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చింది. ఈ మూడు శాఖలకు సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం ఈ నిర్మాణ పనులను పూర్తిగా విస్మరించింది. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు నిలిపివేయడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఐదు నెలలుగా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గ్రామపంచాయతీ కార్యాలయాలు. అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య సేవలు అందిస్తున్నారు.

బిల్లులు మంజూరు చేయని ప్రభుత్వం..

అద్దంకి నియోజకవర్గంలో 85 సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. సచివాలయ నిర్మాణానికి రూ. 43 లక్షలు. రైతు భరోసా కు రూ. 24 లక్షలు. విలేజ్ హెల్త్ క్లినిక్ కు రూ. 20 లక్షలు నిధులు కేటాయించారు. బల్లికురవ మండలంలో 20 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో బల్లికురవ. నక్కబొక్కలపాడు, ఎస్ఎల్ గుడిపాడు సచివాలయ భవనాలు. ముక్తేశ్వరం, కొత్తూరు, వెలమవారిపాలెం, ఎస్ఎల్ గుడిపాడు, బల్లికురవ, నక్కబొక్కలపాడులో ఆర్బీకేలు పిల్లర్లు నిర్మాణ దశలోనే ఉన్నాయి. సోమవరప్పాడు. కొనిదెన ఆర్బీకేలు తుది దశ పనులు నిలిచాయి. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వేమవరం మాత్రమే పూర్తయింది. కొత్తూరు. ఉపమాగులూరు-1. సచివాలయాల్లో తుది దశ పనులు నిలిచాయి. సంతమాగులూరు మండలంలో 20 సచివాలయాలు ఉన్నాయి. కామేపల్లి, కొమ్మలపాడులో పనులు పూర్తి కాలేదు. ఆర్బీకే విలేజ్ హెల్త్ క్లినిక్ 10 గ్రామాల్లో పూర్తి కావాల్సి ఉంది. పంగులూరు మండలంలో ఒకటి రెండు గ్రామాల మినహా అన్ని గ్రామాల్లో పనులు తుది దశతో పూర్తయ్యాయి. కొరిశపాడు మండలంలో 14 సచివాలయాలనుగా తిమ్మనపాలెం, కొరిశపాడు, మేదరమెట్లలో నిర్మాణ పనులు చేపట్టలేదు. అద్దంకి మండలంలో 17 సచివాలయాలు ఉండగా ఏడు గ్రామాల్లో పనులు పూర్తి కాలేదు. సచివాలయాల నిర్మాణానికి కేటాయించిన నిధులు ఉన్నా కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడం లేదు. వడ్డీలకు అప్పులు తెచ్చి నిర్మాణ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు బిల్లుల చెల్లింపులు జాప్యంతో అప్పుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. బిల్లుల చెల్లింపుతో పాటు. అసంపూర్తి పనులు పూర్తితో వినియోగంలోకి తెస్తే ప్రజలకు, వివిధ శాఖల ఉద్యోగులకు ఇబ్బందులు తొలుగుతాయి.

ఆర్బీకే బిల్లులు చెల్లించాలి..



ఉప్పమాగులూరు సచివాలయం పరిధిలో ఆర్బీకే నిర్మాణ పనులు చేపట్టా. తుది దశ పనులు పూర్తి చేయాల్సి ఉంది. బిల్లు చెల్లింపు జరగలేదు. ఎం. బుక్ రికార్డింగ్ ప్రకారం బిల్లు చెల్లిస్తే తుదిదశ పనులు కూడా పూర్తి చేసి అప్పగిస్తాను.
– హెచ్ కిషోర్ నాయక్, కొత్తూరు.

బిల్లు చెల్లిస్తే పనులు పూర్తి చేసి అప్పగిస్తా



గ్రామ స్వరాజ్య స్థాపనకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లిస్తే భవనాలన్నీ వినియోగంలోకి వస్తాయి. మా గ్రామంలో ఆర్బీకే నిర్మాణ పనులు ఫౌండేషన్ దశ వరకు తీసుకొచ్చాను. బిల్లు చెల్లిస్తే పనులు పూర్తి చేసి అప్పగిస్తాను.
– కల్లి ఆంజనీప్రసాద్ రెడ్డి, ఉప్పమాగులూరు



పిల్లర్ల దశలో పనులు నిలిచిన కొత్తూరు ఆర్బీకే



తుది దశ పనులు నిలిచిన ఉప్పమాగులూరు ఆర్బీకే



తుదిదశ పనులు నిలిచిన అంబడిపూడి సచివాలయం

ఉద్దేశపూర్వకంగానే తొలగింపునకు యత్నం



ఏరియా వైద్యశాలలో పుష్పలతను పరామర్శిస్తున్న రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

చీరాల అర్బన్: ఆత్మహత్యాయత్నం చేసిన మధ్యాహ్న భోజన కాంట్రాక్ట్ వర్కర్ కాగితాల పుష్పలతను బుధవారం ఏపీ మధ్యాహ్న భోజన పథకం (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి చీరాల ఏరియా వైద్యశాలలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా కస్తూర్బా గాంధీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో మిడ్ డే మీల్ వర్కర్‌గా పనిచేస్తున్న పుష్పలతను అన్యాయంగా తొలిగించేందుకు ప్రయత్నాలు చేశారన్నారు. ఆమెపై ఎలాంటి రిమార్కు లేదన్నారు. ఈనెల 7న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ ప్రతాపరెడ్డి పాఠశాలలను సందర్శించి మెనూ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అక్టోబర్‌లో చీరాల సీనియర్ సివిల్ జడ్జి ఎం.సుధ పాఠశాలలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. స్కూల్ హెచ్ఎం, ఎంఈఓ కేవలం రాజకీయ కక్షల నేపథ్యంలో తొలగించడానికి ఉత్తర్వులు ఇవ్వడానికి ప్రయత్నించగా మనస్తాపంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. సరైన వేతనాలు లేకపోయినా అప్పులు చేసి భోజనాన్ని అందిస్తున్న చిరుద్యోగి పట్ల ప్రభుత్వ వైఖరి సరైంది కాదన్నారు. వెంటనే తొలగింపు ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.వసంతరావు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌లను నియమించాలి



మాట్లాడుతున్న నీలం నాగేంద్రం, నాయకులు

మేదరమెట్ల: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌లను తక్షణమే నియమించాలని రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ డీఎస్పీలను నియమించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్ష్యుడు నీలం నాగేంద్రం డిమాండ్ చేశారు. కొరిశపాడులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లను నియమించలేదన్నారు. ఒక వేళ కేసు కట్టినా డీఎస్పీలు స్థానిక శాసనసభ్యుల కనుసన్నలల్లో ఉంటూ కేసులను ఫాల్స్ కేసులుగా రిఫర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లాకు ఒకరి చొప్పున ఎస్సీ, ఎస్టీ డీఎస్పీని నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాలమహానాడు ప్రధాన కార్యదర్శి కాకుమాను రవి, దళిత నాయకులు యరమాల శ్రీనివాసరావు, ఎర్రమోతు నారాయణ, బొనిగల యోగయ్య, రత్నకుమార్, శేషయ్య ఉన్నారు.

ఘనంగా న్యాయవాదుల కార్తీక వన సమారాధన



వన సమారాధనలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

చీరాల రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కోర్టు భవన ఆవరణంలో బార్ అసోసియేషన్, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో న్యాయవాదులు కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని భోజన విరామసమయంలో ఘనంగా నిర్వహించారు. న్యాయ మూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్. నిషాద్ నాజ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. న్యాయవాదులంతా కుల, మతాలకు అతీతంగా ఒక సమూహంగా ఏర్పడి వన సమారాధన కార్యక్రమంలో పాల్గొనడం మంచి పరిణామమని ఐఏఎల్ నిర్వాహకులను అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, ఐఏఎల్ అధ్యక్షుడు కరవది భానుప్రకాష్, బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి ఈశ్వరి రెడ్డి, ఏపీపీ పద్మజ, పీపీ పద్మ, ఇన్‌చార్జ్ ఏజీపీ శ్యామలాదేవి, ఐఏఎల్ ప్రతినిధులు బూదరాజు శశికిరణ్, మేరుగ రవికుమార్, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో కోదండరామ స్వామి

చీరాల అర్బన్: పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ అభయ వీరాంజనేయ కోదండ రామాలయంలో కార్తీక మాస పర్వదినాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి అన్న ప్రసాద వినియోగ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భర్త, అత్తామామలపై ఫిర్యాదు

వేటపాలెం: పందిళ్లపల్లికి చెందిన బోజ్జా తన్మయి తన భర్త నక్కల రామకృష్ణ, అత్త, మామ, ఆడపడుచులు అధిక కట్నం తీసుకు రావాలని తరుచూ వేధిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజన ఉద్యమ పిత బిర్సా ముండా

వేటపాలెం: బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా గిరిజన హక్కుల సాధన కోసం పోరాడిన ఉద్యమ పితాగా బిర్సా ముండా చరిత్రలో నిలిచిపోయారని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణస్వామి పేర్కొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిర్సా ముండా జయంతి ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి జె. సుబ్బయ్య మాట్లాడుతూ ఉత్తరాదిన జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, చత్తీసగఢ్ వంటి రాష్ట్రాల్లో గిరిజనుల్లో చైతన్యం పెరిగేలా రాజీలేని కృషి చేశారని తెలిపారు. పాతికేళ్ల వయసులోనే వీరిని జైలులో బంధించి బ్రిటిష్ ప్రభుత్వం స్లో పాయిజన్ ద్వారా హత మర్చిందన్నారు. వీరు సేవల గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వీరి పేరిట విశ్వవిద్యాలయాలు, విమానాశ్రయం, నెలకొల్పిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం. శేఖర్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ చెరుకూరి రాంబాబు, ఉపాధ్యాయులు కటకం వెంకటనారాయణ, ఎద్దు రత్నం, కర్ణ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పప్పుదినుసులు సాగు చేయండి

మార్టూరు: పొగాకు సాగుకు ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు సాగు చేపట్టాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో బుధవారం మాట్లాడుతూ పప్పు దినుసులు సాగు చేయడం ద్వారా మంచి లాభాలు పొందవచ్చని తెలిపారు. ఉద్యాన వనశాఖాధికారి హనుమంతనాయక్, ఎంపీటీసీ దందా హరిబాబు పాల్గొన్నారు.

చట్టాల గురించి తెలుసుకోండి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి ఈశ్వరి రెడ్డి

చీరాల రూరల్: విద్యార్థులు చట్టాలను గురించి తెలుసుకున్నప్పుడు న్యాయ సహాయం పొందగలుగుతారని బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి ఈశ్వరి రెడ్డి అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకుని ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆంధ్ర రత్న మున్సిపల్ హైస్కూలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు ఈశ్వరిరెడ్డి, బి. శ్రీనివాసరావు మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుండి క్రమ శిక్షణతో చదువుకోవాలని సూచించారు. ముఖ్యంగా చెడు ప్రవర్తనను విడనాడి సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్‌లు సినిమాలు వంటివాటికి దూరంగా ఉండాలని సూచించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ వంటి గురించి తెలుసుకోవాలన్నారు. ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉచిత న్యాయ సేవలకోసం 15100 నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు. చిన్న పిల్లలను వేధించినట్లయితే అట్టివారిపై చిల్డ్రన్స్ ప్రొటక్షన్ యాక్టు కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షిస్తుందని చెప్పారు. పీఎల్‌వీలు మతిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

చినగంజాం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంఈఓ బొల్లిముంత అజయ్ బాబు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రంథపాలకుడు అళహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో బుధవారం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు యర్రవరపు రామాంజనేయులు, శ్రీనివాసరావు, పర్వతరెడ్డి కాంతారావు, హెచ్ఎం కుర్రా రామారావు, వెంకట రామానుజం, సర్పంచ్ రాయని ఆత్మారావు, దామోదరరెడ్డి, రామాంజనేయులు రెడ్డి పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ సుగుణరావు ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. రిటైర్డు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి తాళ్లూరి పీటర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో రిటైర్డు ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి, రిటైర్డు ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు బుధవారం ప్రసంగించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఎస్.సుబ్బరామయ్య, మునీరుల్లాఖాన్, చుండూరి కృష్ణమూర్తి, రూపాదేవి, చంద్రమౌళి, కిషోర్, గ్రంథపాలకురాలు డి.ధనమ్మ పాల్గొన్నారు.

వాడరేవులో విస్తృత తనిఖీలు

చీరాల టౌన్: తీరప్రాంత రక్షణలో భాగంగా నిర్వహిస్తున్న సీ- విజిల్‌లో భాగంగా బుధవారం వాడరేవులో విస్తృతంగా వాహనాలు, అనుమానితులను తనిఖీలు చేపట్టారు. రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది తీరం గస్తీలు నిర్వహించారు. వాడరేవు, రామాపురం, విజయలక్ష్మీపురం, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం తదితర తీర ప్రాంత గ్రామాలతో పాటు సముద్రం నుంచి బయటకు వస్తున్న బోట్లు, అనుమానిత వ్యక్తులతో పాటు తీరానికి వస్తున్న పర్యాటకుల వాహనాలు ఎస్సై చంద్రశేఖర్ తనిఖీ చేశారు. తీర ప్రాంత గస్తీకి కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పలు సూచనలు చేశారు.

రీ సర్వే సమస్యల పరిష్కారం

జె.పంగులూరు: మండలంలోని రీ సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి గ్రామ, మండల స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు మండల తహసీల్దార్ పి. సింగారావు తెలిపారు. మండల పరిధిలోని చందలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం రీ సర్వే సమస్యలు పరిష్కారంలో భాగంగా తహసీల్దార్ సింగరావు అధ్వర్యంలో రైతులతో మాట్లాడారు. 6 గ్రామాల్లో రీ సర్వే జరిగినట్లు తెలిపారు. ఆ గ్రామాలకు సంబంధించి గ్రామ సభలు నిర్వహించనట్లు తెలిపారు. గ్రామ సభల్లో మొత్తం 453 సమస్యలను గుర్తించినట్లు చెప్పారు. ఈ సమస్యలు పరిష్కారం నిమిత్తం గ్రామ స్థాయిలో వీఆర్‌ఓ, సర్వేయర్‌ను ఒక బృందంగా నియమించి, మండల స్థాయిలో పరిశీలన నిమిత్తం రీ సర్వే డీటీ, మండల సర్వేయర్, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్‌ను పర్యవేక్షణ అధికారులుగా నియమించనట్లు తెలిపారు. డిసెంబర్ 15 లోపు సమస్యల పరిష్కారం దిశగా అధికారులు పనిచేస్తారన్నారు. చందలూరులో 181 సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. మండల సర్వేయర్ సురేష్, వీఆర్‌వో పరశరామిరెడ్డి, గ్రామ సర్వేయర్ నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

చదువు ప్రాముఖ్యత గుర్తించాలి

చినగంజాం: చదువు ప్రాముఖ్యతను ప్రతి ఆడపిల్ల గుర్తించాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ వాణిశ్రీ సూచించారు. బుధవారం భేటీ పడావో, భేటీ బచావో కార్యక్రమాన్ని స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో నిర్వహించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు

చినగంజాం: అవకాశం కల్పిస్తే మహిళలు అన్ని రంగాల్లో మగవారికంటే ముందుంటారని ఎల్‌సీడీడీపీ జిల్లా కో ఆర్డీనేటర్ ఏ రాజ్‌కుమార్ అన్నారు, బుధవారం ఎల్‌సీడీడీపీ, దివ్యాంగుల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదగంజాం పల్లెపాలెం సచివాలయంలో లింగ వివక్షత వాతావరణ మార్పు అనే అంశంపై అవగాహన కల్పించారు.

శ్రీశ్రీ విధుశేఖరభారతీ మహాస్వామి నేడు రాక

సంతమాగులూరు (అద్దంకి రూరల్): శ్రీ భారతీ తీర్థ మహాస్వామి ఆశీస్సులతో విజయయాత్ర చేపట్టిన శ్రీ విధుశేఖరభారతి మహాస్వామి మిన్నెకల్లుకు గురువారం రానున్నారు. అక్కడ తంగిరాల అనంతలక్ష్మమ్మ గారి స్మారక కల్యాణ మండపం ప్రారంభోత్సానికి హాజరు అవుతారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

అద్దంకి రూరల్: మండలంలోని తిమ్మాయపాలెం మెట్ట పొలాల్లో అడుసుమల్లి రాంబాబు పొలంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్‌ను పగలకొట్టి అందులోని రాగివైరు దొంగిలించారు. గ్రామస్తులు విద్యుత్ ఏఈకి తెలియపరిచారు. పోలీసు శాఖ వారు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.